గ్యార్మీ షరీఫ్ ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే



ప్రార్థనలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



ఉత్సవాల్లో కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: చింతల డివిజన్ వివేకానంద్‌నగర్‌లో ఆదివారం ఉర్స్–ఈ–షరీఫ్ సందర్భంగా గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత సామరస్యానికి ప్రతీకగా గ్యార్మీ ఉత్సవాలు నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నరేశ్, అలీ, ఆసిఫ్, మహబూబ్, చాంద్ పాషా, బాదే మస్తాన్, ఖదీర్, విఠల్, బిల్లా వెంకట్, మహమ్మద్ అలీ, బ్రహ్మం పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుంచి కుత్బుల్లాపూర్ కు చెందిన పూజిత, హేమ, దివ్య ఎంపికయ్యారు. ఈ సందర్భంగా యోగా గురు మల్లేశ్, ఇన్‌స్ట్రక్టర్ విజయ్‌కుమార్‌తో కలిసి షాపూర్‌నగర్‌లోని నివాసంలో మాజీ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. చిన్నారులను అభినందించిన శ్రీశైలంగౌడ్ జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

గ్యార్మీ ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీక

రంగారెడ్డినగర్: గ్యార్మీ ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. గాంధీనగర్‌లో శనివారం రాత్రి గ్యార్మీ ఉత్సవాల్లో ఆయన పాల్గొని చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సోదరభావాన్ని పెంపొందించే గ్యార్మీ ఉత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు శివ కుమార్, సుబ్బారెడ్డి, భాస్కర్ రెడ్డి, గ్యార్మీ ఉత్సవ కమిటీ సభ్యులు ఉస్మాన్, తాహెర్ ఖాన్, ఇర్ఫాన్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.



పద్మానగర్ ఫేజ్–1 నూతన కమిటీ సభ్యులు

ఏకగ్రీవంగా నూతన ఎన్నిక

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మానగర్ కాలనీ ఫేజ్–1 సంక్షేమ సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ సలహాదారులు ముత్యాలు, వెంకటేశ్వర రావు, శివనాగిరెడ్డి, ఖాసీం, జయసింహారెడ్డి సమక్షంలో జరిగిన సమావేశానికి 400 మంది కాలనీసభ్యులు పాల్గొన్నారు. సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా సత్తిరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా దయాకర్, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దేవేందర్‌రెడ్డి, కోశాధికారిగా ప్రసాద్, సహాయ కోశాధికారిగా అరవింద్ యాదవ, సంయుక్త కార్యదర్శులుగా సత్యం, కృష్ణారావు, వేణు, మోహన్, సుబ్బారెడ్డి, కార్యనిర్వాహణ కార్యదర్శులుగా రంగ సుబ్బయ్య, భాస్కర్ రెడ్డి, రమణరెడ్డి, సందీప్‌రెడ్డి, ఠాకూర్ వినోద్‌సింగ్‌తో పాటు 14 మందిని ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎన్నుకున్నారు. అదేవిధంగా సోషల్ మీడియా కన్వీనర్‌గా సుధాకర్‌ను నియమించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ కాలనీవాసులను కలుపుకుని స్థానికంగా అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు.

బాచుపల్లి ఇన్‌స్పెక్టర్ ఉపేందర్‌కు ప్రశంసాపత్రం



సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న ఇన్‌స్పెక్టర్ ఉపేందర్

నిజాంపేట్: క్రిమినల్ కేసులను చేధించి ఇద్దరు నిందితులకు కోర్టు జీవితకాల ఖైదు విధించడంలో కీలకంగా వ్యవహరించిన బాచుపల్లి ఇన్‌స్పెక్టర్ ఉపేందర్‌కు సైబరాబాద్ కమిషనరేట్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సీపీ అవినాష్ మహంతి అప్రిషియేట్ సర్టిఫికేట్‌ను అందజేశారు. తలకొండపల్లి, అమంగల్ పీఎస్‌ల పరిధిలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన ఉపేందర్ నేరారోపణలు ఎదుర్కొన్న ఇద్దరు నిందితులకు శిక్షపడేలా ఇన్వెస్టిగేషన్ చేసి కోర్టుకు కీలక ఆధారాలు అందజేశారు. ఈ నేపథ్యంలో సీపీ ఆయన సేవలను కొనియాడుతూ సీఐ ఉపేందర్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్–1 పరీక్షలు



పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులు

మల్కాజిగిరి: గత వారం రోజులుగా జరుగుతున్న గ్రూప్ –1 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతగా ముగిశాయి. మల్కాజిగిరి ప్రోబుల్స్ పాఠశాలలో రెండు కేంద్రాలు పరీక్షలకు కేటాయించారు. చివరిరోజు మొత్తం 1394 మంది అభ్యర్థులకు 913 మంది హాజరు కాగా.. సెంటర్ 1 లో 133 మంది, సెంటర్ 2లో 348 మంది గైర్హాజరయ్యారు. దివ్యాంగ అభ్యర్థుల్లో 136 మందికి 93 మంది హాజరుకాగా.. సెంటర్ 1లో 7 మంది, సెంటర్ 2లో 26 మంది హాజరుకాలేదు. మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

రామంతాపూర్ : వాగ్దేవి మహిళా డిగ్రీ కళాశాల, మెగా మహిళా డిగ్రీ కళాశాల, స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో ఈనెల 21 నుంచి వరుసగా 7 రోజుల పాటు నిర్వహించిన గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. రామంతాపూర్‌లో ఏర్పాటు చేసిన గ్రూప్ - 1 పరీక్ష కేంద్రాల్లో పటిష్ట బందబోస్తుతో పాటు 144 సెక్షన్ విధించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవడంతో పరీక్షలు ప్రశాతంగా ముగిశాయని పోలీసు అధికారులు ప్రకటించారు.

సర్కారు బడిలో కంపు..కంపు!

- సంజయ్‌గాంధీనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అధ్వానంగా టాయిలెట్లు
- నిర్వహణ లేక విద్యార్థుల ఇబ్బందులు



సంజయ్‌గాంధీనగర్ ఎంపీపీ పాఠశాల



సంజయ్‌గాంధీనగర్‌లోని ఎంపీపీ పాఠశాలలో అపరిశుభ్రంగా మూత్రశాల

రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా చాలా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగు పర్చడంలో అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ప్రధానంగా రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి సంజయ్‌గాంధీనగర్‌లోని ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక '(ఎంపీపీ) పాఠశాలలో టాయిలెట్లు కంపు కొడుతున్నాయి. ప్రతిరోజు వాటిని శుభ్రం చేయాల్సిన స్కావెంజర్ లేకపోవడంతో అధ్వానంగా మారాయి. దీంతో చిన్నారులు మూత్ర విసర్జన చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరబడి వాటిని శుభ్రం చేయకపోవడంతో తరగతి గదుల్లో కూర్చునే విద్యార్థులు వాసన భరించలేకపోతున్నారు. ఇక ఉపాధ్యాయుల పరిస్థితి చెప్పనక్కర్లేదు. మహిళా ఉపాధ్యాయులైతే సమీపంలోని ఇళ్లలోకి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

కారణం ఇదే..

మూత్రశాలలను ఏర్పాటు చేసిన అధికారులు మురుగనీరు బయటకు వెళ్లేందుకు ఔట్‌లెట్‌ను నిర్మించడం మరిచారు. దీంతో మూత్ర విసర్జన చేసినా వ్యర్థాలు బయటకు వెళ్లడం లేదు. మూత్రశాలల నుంచి ప్రధాన డ్రైనేజీ లేన్‌కు అనుసంధానం చేస్తే సమస్య పరిష్కారమవుతుందని పలుమార్లు స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది..



పాఠశాల మూత్రశాలలను శుభ్రం చేయక పోడంతో పాటు వ్యర్థాలు బయటకు వెళ్లకపోవడంతో అపరిశుభ్రత నెలకొంటోంది. దీంతో మా పిల్లలు పలుమార్లు అనారోగ్యానికి గురయ్యారు. విద్యాశాఖ అధికారులు స్పందించి మూత్రశాలలను శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలి.

– ప్రమీల, సంజయ్‌గాంధీనగర్

'వీసీల నియామకంలో కామర్స్ ప్రొఫెసర్లకు అన్యాయం'

ఉస్మానియా యూనివర్సిటీ: వీసీల నియామకంలో కామర్స్ ప్రొఫెసర్లకు తీరని అన్యాయం జరిగిందని తెలంగాణ కామర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ డాక్టర్.ఎం రామేశ్వర్ రావు ఆదివారం పేర్కొన్నారు. వర్సిటీలలో కామర్స్ కోర్సుకు అధిక ప్రాధాన్యత ఉందని బీకాం, ఎంకామ్‌లో ఇతర కోర్సుల కంటే ఎక్కువగా విద్యార్థులు ప్రవేశం పొందుతారని తెలిపారు. కామర్స్ చదివిన విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన వివరించారు. అయినా ఇంత వరకు నియమించిన వీసీలలో ఒక్క కామర్స్ ప్రొఫెసర్ కూడా లేకపోవడం విచారకరమన్నారు. కామర్స్ అధ్యాపకులను వీసీలుగా నియమిస్తే వర్సిటీలు అభివృద్ధి చెందుతాయన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

మోతీనగర్: సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో వివేక్ డెంటల్ సౌజన్యంతో గాయత్రీనగర్‌లో ఏర్పాటు చేసిన ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత దంత వైద్య శిబిరాన్ని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తరుచూ దంత పరీక్షలు చేయించుకుని, కాపాడుకోవాలని సూచించారు. క్యాంపు ఏర్పాటు చేసిన వైద్యుడు వివేక్‌ను అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ఫోరం సభ్యులు సూరిబాబు, వెంకటేశ్వర్లు, సంజవరెడ్డి, జ్ఞానేశ్వర్, జాహేద్ షరీఫ్ బాబా, యోగి రాజు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనుల పరిశీలన

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్‌లోని వివేకానందనగర్‌కాలనీలో రూ. 55 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు పనులను కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావలని సూచించారు. మరికొన్ని సీసీ రోడ్లు కూడా మంజూరయ్యాయని వాటిని కూడా త్వరలోనే ప్రారంభమయ్యేలా చూస్తామని పేర్కొన్నారు. సీవరేజ్ లైన్లు వేయాల్సి ఉన్నాయని, పనులు పూర్తి చేసిన అనంతరం రోడ్డు పనులు మంజూరు చేయించి కాలనీ ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.

సీపీఐ జనరల్ బాడీ సమావేశం

బాలానగర్: కూకట్‌పల్లి మండల పరిధిలోని శ్రీశ్రీనగర్‌లోని కార్యాలయంలో శ్రీశ్రీనగర్ సీపీఐ కార్యదర్శి కే మనోచారి అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి మండల సీపీఐ కార్యదర్శి కృష్ణ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఆరు గ్యారంటీలను విస్మరించిందన్నారు. వెంటనే అమలుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వస్థలంలో అక్రమ డంపింగ్..!





ప్రభుత్వ స్థలంలో డంపింగ్ చేసిన భవనాల వ్యర్థాలు

నిజాంపేట్: బాచుపల్లిలోని డబుల్ బెడ్రూం గృహసముదాయాన్ని ఆనుకుని ప్రభుత్వ స్థలంలో యథేచ్ఛగా అక్రమ డంపింగ్ కొనసాగుతోంది. కొన్ని రోజులుగా రాత్రి వేళల్లో టిప్పర్లలో భవనాల వ్యర్థాలను తీసుకువచ్చి పడేస్తున్నారు. గతంలో బాచుపల్లి పోలీసులు డంపింగ్ చేసే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేయగా, కొద్ది రోజుల పాటు నిలిపి వేశారు. ఇటీవల తిరిగి మళ్లీ ప్రారంభించారు. రాత్రి సమయంలో టిప్పర్ల రాకపోకలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది నాయకుల అండతోనే ఈ అక్రమ డంపింగ్ జరుగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే అక్రమ డంపింగ్ నిలిపి వేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..!



నందనవనంకాలనీలో కుంగిన మ్యాన్‌హోల్

నిజాంపేట్: అధికారుల పర్యవేక్షణ లోపం.. కాంట్రాక్టర్ల నాసిరకం పనులతో పలు అభివృద్ధి పనులు మూణ్నాళ్ల ముచ్చటగానే మారుతున్నాయి. బాచుపల్లి నందనవనం కాలనీలో ఏడాది క్రితం భూగర్భ డ్రైనేజీలు ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల వాహనాల రాకపోకలతో మ్యాన్‌హోల్ కుంగిపోవడంతో పాటు మూత ధ్వంసమైంది. ప్రమాదకరంగా మారిన వాటికి మరమ్మతులు చేపట్టాలని నెల క్రితం కాలనీ అసోసియేషన్ సభ్యులు శానిటేషన్ ఇన్‌చార్జి సుకృతిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన ఆమె సదరు సిబ్బందిని మరమ్మతులు చేయాలని ఆదేశించారు. అయినా ఇప్పటి వరకు చేపట్టలేదని త్వరగా మరమ్మతులు చేపట్టి రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సమాజసేవలో శ్రీకృష్ణా యూత్ ముందుంటుంది

- శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్

రాయదుర్గం: సమాజ సేవలో శ్రీకృష్ణా యూత్ ఎప్పుడూ ముందుంటుందని శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గౌలిదొడ్డిలో అపోలో ఆస్పత్రి సహకారం శ్రీకృష్ణా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి, వైద్య శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సమాజంలో ఎంతో మంది వ్యాధులను గుర్తించలేక వైద్యానికి దూరమవుతూ అనేక రోగాల బారినపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి పేద, మధ్య తరగతి ప్రజలకు ఆస్పత్రికి వెళ్లలేని వారికోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.

శ్రీకృష్ణయూత్ అసోసియేషన్ ఉచిత వైద్య శిభిరాలను నిర్వహించడం హర్షణీయమని అన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని ప్రాంతాల్లో సేవాకార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు. అంతకుముందు అపోలో వైద్య బృందం స్థానికులకు వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. శ్రీకృష్ణయూత్ రాష్ట్ర అధ్యక్షుడు అభిషేక్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు సురేందర్, అనీల్, రోహిత్‌గౌడ్, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆదిత్యముదిరాజ్, హన్మంతు, సతీష్‌చారి, శివానందరెడ్డి, ప్రతీష్‌యాదవ్, కిరణ్, అంకుష్, సాయినాథ్, గోపాల్, సంగమేష్, దేవేందర్, ముర్తజా పాల్గొన్నారు.

బూటకపు హామీలతో అధికారంలోకి కాంగ్రెస్

జీడిమెట్ల: బూటకపు హామీలు ఇచ్చి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. 130 సుభాష్ నగర్ డివిజన్‌లోని వెంకటాద్రినగర్‌లో బీజేపీ నాయకుడు ఎం.ఎస్.వాసు అధ్యక్షతన ఆదివారం చేరికల కార్యక్రమం జరిగింది. రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ శ్రేణులు సుభాష్ నగర్ పైపులైన్ రోడ్డు నుంచి వేదిక వరకు ఘన స్వాగతం పలికారు. డివిజన్‌కు చెందిన పలు పార్టీల నాయకులు చిన్నస్వామితో పాటు వారి సతీమణి సెల్వరాణి, ప్రసన్నకుమార్, సురేశ్‌కుమార్, వారి మిత్రులు పార్టీలో చేరగా వారికి ఈటల రాజేందర్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకూ తగిన గౌరవం దక్కుతుందన్నారు. దేశంలోనే అతి శక్తవంతమైన పార్టీగా బీజేపీ ఉద్భవించిందని కొనియాడారు. పీఎం నరేంద్రమోడీ అధ్యక్షతన దేశం పురోగతిలో ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక స్థానాలు కైవసం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కంది శ్రీరాములు, హనుమాన్ కచావా, సౌరభ్ సింగ్, జనసేనా మహిళా నాయకురాలు లక్ష్మి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

బీజేపీకి దేశంలోనే అధిక సభ్యత్వం

మోతీనగర్: దేశంలోనే అధిక సభ్యత్వం గల పార్టీ బీజేపీ అని మేడ్చల్ జిల్లా బీజేపీ కార్యదర్శి పులిగొల్ల శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆదేశాల మేరకు శ్రీ వివేకానందనగర్, గాయత్రీనగర్, పర్వత్‌నగర్, తులసీనగర్‌తో పాటు పలు బస్తీ కాలనీల్లో ఆదివారం ఇంటింటికీ తిరుగుతూ సభ్యత్వాన్ని నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హరికృష్ణ, శ్రీనివాస్, వసంత, వాసంతి, రఘు, చింటు, గోపి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవివేకానందనగర్ చౌరస్తాలో..

శ్రీ వివేకానందనగర్ చౌరస్తాలో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఆన్‌లైన్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, వెంకట్రాంరెడ్డి, గోనెల సుదర్శన్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మూసాపేట డివిజన్‌లో..



మూసాపేట: మూసాపేట డివిజన్‌లో మేడ్చల్–మల్కాజిగిరి అర్బన్ జిల్లా కార్యదర్శి తూము శైలేష్‌కుమార్ ఆధ్వర్యంలో మూసాపేటలో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి హాజరై ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో మూసాపేట డివిజన్ అధ్యక్షుడు పిట్ల మనోహర్, సద్గుణ రెడ్డి, బీసీ నాయకులు నాగరాజు, శ్రీకర్ రావు, విజయభవానీ, శోభారాజన్, బీజేవైఎం నాయకులు సాయి, వాసవి, శ్రీకాంత్, శేషారావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజల చూపు బీజేపీ వైపు

కూకట్‌పల్లి: తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి అన్నారు. బాలానగర్ డివిజన్ అధ్యక్షుడు వినోద్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన సభ్యత్వ నమోదుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సూర్యరావు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, శ్రేణులు గోపి, రాము, సోమశేఖర్, భగవంత్, అనిల్, సంతోష్, శేఖర్, సూరిబాబు, ప్రేమ్ కుమార్, వెంకటరమణ, జగదీష్, చలపతి, వినోద్, జ్యోతి, రేణుక, లహరి పాల్గొన్నారు.

ఆలయాలు ఆధ్యాత్మిక నిలయాలు



ఆలయ ప్రారంభోత్సవంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి

దుండిగల్: ఆలయాలు ఆధ్యాత్మిక నిలయాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపల్ భౌరంపేట్‌లోని ఆర్ఎస్‌జీ సుప్ర గేటెడ్ కమ్యూనిటీలో నూతనంగా నిర్మించిన గణపతి ఆలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఆయన హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌జీ సుప్ర గేటెడ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి



శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ

కుత్బుల్లాపూర్: కార్మికులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూరారం కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ అన్నారు. సూరారం డివిజన్ నెహ్రూనగర్‌లో లేబర్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు కార్మికులకు పలు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

లైఫ్ స్పాన్ ఆస్పత్రికి బెస్ట్ ఎమర్జింగ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న లైఫ్ స్పాన్ ఆస్పత్రి వైద్యులు

జీడిమెట్ల: జీడిమెట్ల లైఫ్‌స్పాన్ ఆస్పత్రికి బెస్ట్ ఎమర్జింగ్ అవార్డు వరించింది. రాష్ట్ర వైద్యాశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా చేతుల మీదుగా ఆస్పత్రి యాజమాన్యం డైరెక్టర్లు వైద్యులు నరేంద్రరామ, సురేశ్‌రాజు, ప్రేమ్‌కుమార్, అనిల్‌కుమార్ అవార్డు అందుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో అవార్డు వచ్చిందని వారు తెలిపారు.

ఆర్చరీలో గోల్డ్ మెడల్



గోల్డ్‌మెడల్ సాధించిన కాంపౌండ్ టీం సభ్యులతో హనుమంత్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: నియోజకవర్గానికి చెందిన వివేక్ రెడ్డి, శైలజ కుమారుడు హనుమంత్‌రెడ్డి ఇంటర్నేషనల్ కాంపౌండ్ బౌ ఆర్చరీలో గోల్డ్ మెడల్ సాధించాడు. బెహరన్‌లోని ఐఎస్ఎఫ్‌లో జరిగిన పోటీల్లో వివిధ దేశాల నుంచి 5427 స్టూడెంట్స్ పాల్గొనగా దేశం నుంచి 220 మంది విద్యార్థులు అటెండ్ అయ్యారు.

నల్లపోచమ్మ ఆలయం పునః ప్రారంభం



ఆలయానికి కలశాలను అందజేస్తున్న నరసింహగౌడ్, శివగౌడ్

సుభాష్‌నగర్: సాయిబాబానగర్ పుష్పగిరి బస్తీలో నల్లపోచమ్మ ఆలయ పునః ప్రారంభోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానికులు నరసింహగౌడ్, శివగౌడ్ దంపతులు ఆలయానికి కలశాలను అందజేశారు. సోమవారం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది.


మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



మేయర్ నీలారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

నిజాంపేట్: మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. 16వ డివిజన్ కార్పొరేటర్ ఆగం పాండుముదిరాజ్ ఆధ్వర్యంలో ప్రైమ్ కాసెల్ అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేయగా మేయర్ సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో కలిసి స్థానికంగా పర్యటించి పరిష్కరిస్తామని ఆమె హామీనిచ్చారు.

ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ పట్టదా..?



రంగారెడ్డినగర్: ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ అధ్వాన్నంగా తయారైంది. చాలాచోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పిచ్చిమొక్కల పెరిగి తీగలు అల్లుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి రంగారెడ్డినగర్ ప్రధాన రోడ్డులోని బస్టాప్‌కు సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను పిచ్చిమొక్కలు, తీగలు కప్పేశాయి. దీనికితోడూ రక్షణ కంచె లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణను పట్టించుకోవాలని స్థానికులు కోరుతున్నారు.